క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

ఎటపాక: వైఎస్సార్‌సీపీ మండల సమావేశం శనివారం మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అనంతబాబు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారని నేతలు తెలిపారు. ఎన్నికల అనంతరం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, స్థానిక సమస్యల గురించి చర్చించి పరిష్కరించే దిశగా ఎమ్మెల్సీ కృషి చేస్తారని తెలిపారు.ఈ సమావేశానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

సమయపాలన తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. మండలంలోని శంకాడలో శుక్రవారం మెగా శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధిగా పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. నెల రోజుల పాటు దీనిని నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయంలో రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈవోపీఆర్డీ ఎంపీడీవో పాపారావు పాల్గొన్నారు.

చింతపల్లి సీడీపీవోగా శ్రీదేవి



చింతపల్లి: చింతపల్లి మండల శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారిగా సీహెచ్.శ్రీదేవి నియమితులయ్యారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సాధారణ బదీలల్లో భాగంగా చింతపల్లిలో ఇప్పటి వరకూ విధులు నిర్వహించిన జి.వి. రమణకు నర్సీపట్నం బదిలీ కాగా ఆ స్థానంలో వి.మాడుగులలో సీడీపీవోగా ఉన్న శ్రీదేవిని ఇక్కడకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు.

ఎంపీడీవోగా శ్రీనివాస్‌దొర బాధ్యతల స్వీకరణ


శ్రీనివాస్‌దొరకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

చింతూరు: స్థానిక ఎంపీడీవోగా సుండం శ్రీనివాస్‌దొర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రంపచోడవరం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయన చింతూరు ఎంపీడీవోగా అధికారులు బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వహిస్తున్న రామకృష్ణను పాత స్థానమైన దేవీపట్నం ఈవోఆర్డీగా బదిలీ చేశారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌దొరను కార్యాలయ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

వరదలతో అప్రమత్తం

ఎటపాక: గోదావరి వరదల పట్ల గుండాల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి సూచించారు. శుక్రవారం గ్రామ సచివాలయంలో వరదల ముందస్తు చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత గుండాల గ్రామం వరదల సమయంలో ముంపునకు గురయ్యే సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. సహాయక చర్యల సమయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అజయ్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, బాబు, సత్యనారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో దృష్టికి సమస్యలు


ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు సమస్యను వివరిస్తున్న గిరిజనుడు

గూడెంకొత్తవీధి: మండలంలోని దేవరాపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం ఇంటర్ ఫేస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు గ్రామంలో సమస్యలను స్థానికులు తెలియజేశారు. లక్కవరంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, రామగెడ్డలో సీసీ రోడ్డు వేయాలని, చెడ్యాంలో పూడిక తీయించాలని తదితర సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమస్యలను సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు, వీఆర్వో భారతి, సచివాలయ సిబ్బంది మహేశ్వరి, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


కొయ్యూరులో పాడైన పాఠశాల భవనం


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో నిర్మించిన కొత్త భవనం

మోక్షమెన్నడో

- శిథిలావస్థలో పాఠశాల భవనాలు
- అధ్వాన గదుల్లోనే తరగతులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు


పెచ్చులూడుతున్న శ్లాబ్


జీకేవీధిలో పాడైన పాఠశాల భవనం

కొయ్యూరు: మన్యంలో విద్యా వ్యవస్థ అధ్వానంగా మారింది. పాఠశాల దుస్థితిపై కూటమి ప్రభుత్వం కనీసం దృష్టి సారించడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు ద్వారా సర్కారు పాఠశాలలు అభివృద్ధి చెందాయి. ఇందు కోసం అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ఇందులో భాగంగానే మన్యంలోని చాలా పాఠశాలల నిర్మాణం కోసం నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే ఎన్నికల కోడ్ వల్ల పనులన్నీ నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆయా పాఠశాలల నిర్మాణ పనులు, మరమ్మతు పనులపై కనీస దృష్టి సారించలేదు. దీంతో శిథిలభవనాల్లోనే తరగతులు కొనసాగుతున్నాయి. పేదరికంతో కొట్టుమిట్లాడుతున్న గిరిజనం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్ కోసం మంచి విద్య అందించాలని వారు తపిస్తున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వేధిస్తున్న సమస్యలు

మండలంలోని మంప గ్రామంలోని బాలుర ఆశ్రమ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలోనే ప్రస్తుతం తరగతులు కొనసాగుతున్నాయి. బీటలు వారిన గోడలు, శిథిలదశకు చేరిన తలుపులు, కిటికీలు దర్శనమిస్తున్నాయి. భవనం శ్లాబ్ పెచ్చులూడుతున్నాయి. బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు ఉంటున్నారు. విద్యార్థులకు బిక్కుబిక్కుమంటూ భయంతో ఉంటున్నారు. వర్షాలు కురిసినపుడు గదులన్నీ జలమయమవుతున్నాయని వారు చెబుతున్నారు. శ్లాబ్ నుంచి, బీటలు వారిన గోడల నుంచి నీరు కారుతుందంటున్నారు. పుస్తకాలు, సామగ్రి తడిసిపోతున్నాయని, కూర్చోడానికి, నిద్రపోవడానికి కూడా అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1997 వరకు మంప పోలీసు స్టేషన్ ఈ భవనంలో ఉండేది. పోలీసులు ఖాళీ చేసిన అనంతరం భవనాన్ని మావోయిస్టులు పేల్చివేశారు.ఆ సమయంలో భవనం శ్లాబ్ చాలా వరకు పాడైంది. ప్రస్తుతం ఈ భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. అక్కడే విద్యార్థులను పడుకోబెట్టడం చేస్తున్నారు. వందమందికి మించి విద్యార్థులు ఉంటే వారికి వసతి కూడా చాలని పరిస్థితి ఉంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2కోట్లు మంజూరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.రెండు కోట్లు భవనం కోసం మంజూరు చేసింది. దాదాపుగా నిర్మాణం పూర్తి కావస్తుంది. ఈ భవనం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ మాట్లాడుతూ కొత్తగా నిర్మించిన పాఠశాల భవనాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే ఆ భవనంలోకి విద్యార్థులను తరలిస్తామని చెప్పారు.

నిత్యం భయం..భయం

గూడెంకొత్తవీధి: పూర్తిగా శిథిలమైన దామణాపల్లి మండల పరిషత్ పాఠశాల భవనంలో బోధన చేసేందుకు గురువులు భయపడున్నారు. గ్రామస్తులు సైతం వారి పిల్లలను పాఠశాలకు పంపేందుకు భయడుతున్నారు. కొత్త భవనాలు మంజూరు చేయాలని ఇది వరకు స్థానికులు అధికారులకు వినతులు ఇచ్చినా స్పందించలేదని స్థానికులు వాపోతున్నారు. 50 మంది విద్యార్థులున్న ఈ పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో విద్యార్థులు పరిస్థితి దయనీయంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనంలో తరగతుల నిర్వహణ వల్ల ఎప్పుడే ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు కొత్త భవనం మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం నూకరాజు మాట్లాడుతూ భవనాలు పాడైయ్యాయని ప్రస్తుతం ఇందులోని తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల సమస్యపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

అటవీహక్కులపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్

దుంబ్రిగుడ: అటవీ హక్కు పట్ల అవగాహనతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో అటవీ హక్కుల చట్టంపై సదస్సు, ర్యాలీని నిర్వహించారు. మండల పరిషత్ కార్యలయం నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీని చేపట్టి అడవులను కాపాడి పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. అటవీ ఫలసాయంతో ఆదాయాన్ని పెంపొందించుకోవడానికి దోహదపడుతుందన్నారు. అటవీ హక్కుతో సంప్రదాయక హక్కులు పొందవచ్చన్నారు. అటవీ ఉత్పత్తులతో చిన్నతరహా పరిశ్రమలకు వేదికగా నిలుస్తాయన్నారు. సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ ప్రొగ్రాం అధికారి ఆచార్య నాగమణి, ప్రతినిధి గాసినాయుడు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

అడ్డతీగల: మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ పండా సతీష్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల జీవితాలను నాశనమవుతాయన్నారు. మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. వైద్యులు అనూష, ప్రసన్నదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు


నట్టల నివారణ మందును ఇస్తున్న వైద్యులు, ఎంపీటీసీ తదితరులు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో శుక్రవారం పశువైద్యాధికారి లోకుల రమేష్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. మొత్తం 170 మేకలు ,గొర్రెలకు మందు వేసినట్టు ఆయన తెలిపారు. మండల పశువైద్యాధికారిగా లోకుల రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీటీసీ సభ్యురాలు రీమెల రాజేశ్వరి, బీజేపీ, టీడీపీ నాయకులు శేఖర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

నర్సీపట్నం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల దీక్షా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పని చేస్తున్నా పర్మినెంట్ చేయకుండా ఔట్‌సోర్సింగ్ పేరుతో శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు సేవలందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

ఏడీఏ జాహ్నవి బాధ్యతల స్వీకరణ

యలమంచిలి రూరల్: యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కంటా జాహ్నవి శుక్రవారం ఇక్కడి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చింతపల్లి వ్యవసాయ సంచాలకులుగా పని చేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఏవోలు, సిబ్బంది ఆమెకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ శాఖ తరపున రైతులకు మెరుగైన సేవలందించేలా చూస్తానని ఆమె తెలిపారు.

మొక్కజొన్నలో విత్తన శుద్ధి మేలు

అనకాపల్లి: ఖరీఫ్‌లో అధిక దిగుబడినిచ్చే డీహెచ్ఎం 117, 119, 121 వంటి మొక్కజొన్న రకాలను ఎకరాకు 8 కిలోల చొప్పున 60 ఇన్‌టూ 20 సెం.మీ. దూరంలో విత్తుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తేముందు ఫోర్టెన్యా (సయాంట్రనిలిప్రోల్, థయోమిథాక్సామ్) 6 మి.లీ కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసినట్లయితే కత్తెర పురుగు ఉధృతిని కొంత వరకు తగ్గించవచ్చన్నారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని చోడి(రాగి) నారుమడి వేసుకునే రైతులు ఇంద్రావతి, వేగావతి శ్రీ చైతన్య వంటి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎకరానికి 2.5 కిలోల విత్తనం 5 సెంట్ల నారుమడిలో వేసుకోవాలన్నారు. నువ్వుపైరు అధిక తేమను తట్టుకోలేదని, పొలంలో అధిక నీరు చేరినట్లయితే వెంటనే బయటికి తీసివేయాలన్నారు. ఎక్కడైనా పైరులో వేరు కుళ్లుతెగులు కనిపించినట్లయితే కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి 3 గ్రాముల మందును కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. వేరుశనగలో నిత్య హరిత, కదిరి లేపాక్షి వంటి అనువైన రకాలతో వేరుశనగ పైరు వేసుకోవచ్చన్నారు. కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్ 4 మి.లీ నీళ్ల మిశ్రమం మందుతో విత్తన శుద్ధి చేయాలన్నారు. విత్తనం ఆరిన తర్వాత 2 గ్రా. టెబుకోనజోల్ 2 డీఎస్. మందును పట్టించాలని, రెండు రోజుల తర్వాత అంటే విత్తుకునే ముందు కేజీ విత్తనానికి 10 గ్రాములు లేదా 10 మి.లీ రైజోబియం కల్చరును విత్తనాలను పట్టించాలన్నారు. తీగ జాతి కూరగాయ పంటలను వేసుకోవాలన్నారు.

మందులతో ఆరు నెలల్లో క్షయ వ్యాధి నివారణ

అచ్యుతాపురం: క్షయ వ్యాధి ప్రమాదకరం కాదని, ప్రభుత్వం ఉచితంగా అందజేసే మందుల్ని ఆరు నెలల పాటు వాడితే నయమవుతుందని డీఎంఅండ్‌హెచ్ఓ బాలాజీ తెలిపారు. అచ్యుతాపురం టీబీ యూనిట్ పరిధిలో శుక్రవారం పరవాడకు చెందిన లూపిన్ ఫార్మా కంపెనీ సహకారంతో సమకూర్చిన పోషకాహార కిట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం కలిగించాలన్నారు. అచ్యుతాపురం టీబీ యూనిట్ పరిధిలోని 40 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఆయన కిట్లు అందజేశారు.

టీచర్లను నియమించి పాఠశాలను తెరిపించండి

పెదబయలు: మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో 62 ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో తెరుచుకోవడం లేదని స్థానిక వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాడేరులో జరిగిన గ్రీవెన్స్‌లో వెంటనే ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలు తెరువాలని కోరినట్టు చెప్పారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో రిలీవర్ కాకుండానే ఉపాధ్యాయులను ఎలా బదిలీచేశారన్నారు.

దీంతో మండలంలో చాలా ప్రాంతాల్లో పాఠశాలలు నేటికీ మూతపడి ఉన్నాయన్నారు. వేసవి సెలవులు పూర్తయినా పాఠశాలలు తెరచుకోలేదని, గిరిజన విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు విద్యను అందించాలని లేనిపక్షంలో తల్లితండ్రులు, విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు


కె. కోడాపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో డేవిడ్‌రాజ్

జి.మాడుగుల: మండలలో గ్రామాల్లో ఇళ్లు, వీధులు పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో డేవిడ్‌రాజ్ తెలిపారు. మండలంలో కె.కోడాపల్లిలో శుక్రవారం జరిగిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త తొలగించటం, ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీధుల్లో, ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకట్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: ప్రతీ ఒక్కరు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో ప్రసాద్ కోరారు. నడింపాలెం పంచాయతీలో పారిశుధ్య పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరవన్నారు. పరిసరాల్లో మురుగునీరు, చెత్త ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యదర్శి ఎల్.మోహన కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన మండలంలోని ఉపాధి పనులపై ఉపాధి సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులపై సమీక్షించారు. లేబర్ రిపోర్టు ప్రతీరోజు కార్యాలయానికి అందించాలన్నారు. ఫారంపాండ్స్ పనులను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. హార్టీకల్చర్ రైతులను గుర్తించి, అందరికీ ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. కొత్త పనులను వేగవంతంగా గుర్తించాలన్నారు. కంపోర్ట్‌ఫిట్స్ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. పనుల నిర్వహణపై సిబ్బందికి సలహాలు సూచనలిచ్చారు. ఏపీవో సాయిబాబా, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులు


ఎస్.కొత్తూరులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీలో పలు నిర్మాణాలను శుక్రవారం జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి ప్రారంభించారు. మండలంలోని సొలభం పంచాయతీ ఎస్. కొత్తూరు గ్రామంలో జెడ్పీ 15 ఫైనాన్స్ నిధులతో రూ.5లక్షలతో సీసీ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. అలాగే ఎగ రచ్చపల్లి–తడగొంది రోడ్డులో రూ.4లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె భూమిపూజ నిర్వహించారు. మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మత్స్యరాస వెంకటగంగరాజు, సర్పంచ్ హనుమంతరావు, ఎంపీటీసీ చిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యప్రకాష్ నాయుడు, లకే నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు


మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: ఇటీవల కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపై విచారణ చేయాలని తహసీల్దారు రామకృష్ణ వీఆర్వోలను ఆదేశించారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలం నుంచి కొత్తగా 1300 మంది కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేశారన్నారు. వారి వివరాలను పూర్తిగా విచారించి నివేదించాలని ఆయన కోరారు.ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అర్హత లేకపోయినా దరఖాస్తు చేశారన్నారు. అలాంటి వారి దరఖాస్తులను తిరస్కరించాలని సూచించారు.ఇప్పటికే కొందరు దరఖాస్తులను తిరస్కరించామన్నారు. అర్హులకు మాత్రమే రేషన్‌కార్డులు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు దరఖాస్తు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధ్వాన బస్టాండ్‌తో అవస్థలు


కూనవరం బస్టాండ్ దుస్థితి

కూనవరం: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులు పడి, వర్షం నీరు నిలిచిపోతోంది.కొద్దిపాటి వర్షం పడినా గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. గతంలో గోకవరం బస్ డిపో పరిధిలో ఉన్న ఈ బస్టాండ్ ప్రస్తుతం పాడేరు డిపో పరిధిలోకి చేరింది. కాకినాడ, రాజమండ్రి, గోకవరం, పాడేరు, రాజోలు, విజయవాడ డిపోలకు చెందిన బస్సులు ఈ బస్టాండ్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరుచేరడంతో బస్సులు దిగబడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గ్రామస్తుల చొరవతో ఇతర వాహనాల ద్వారా బస్సులను బయటకు తీయాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రయాణికులు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు సైతం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అప్పన్నకు ఒడిశా దాసుడి ఊంజల్ సేవ


ఉయ్యాలను ఊపుతున్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్, దేవస్థానం ఈవో త్రినాథరావు


ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఊంజల్ సేవ ఘనంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ స్వామికి ఈ సేవను విశేషంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో ఒడిశా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కల్యాణమండపంలో శేషతల్పంపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. పుష్పాలతో ద్వాదశి ఆరాధనతో స్వామిని కొలిచారు. లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు స్వామి వేంజేసిన ఉయ్యాలను ఊపారు. ఒడిశా భక్త బృందం కీర్తనలతో స్వామిని సేవించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com